అడవుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం

యాడికి, ఫిబ్రవరి 3 (అనంత ప్రభ)

యాడికి మండలం ఓబులాపురం గ్రామంలో ఫారెస్ట్ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, అడవుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ అధికారులు మాట్లాడుతూ అడవులకు నిప్పు పెట్టడం వల్ల జీవ వైవిధ్యం తీవ్రంగా నాశనం అవుతుందని, దీని కారణంగా వాతావరణ కాలుష్యం పెరిగి మానవ జీవితానికి ముప్పు ఏర్పడుతుందని ఫారెస్ట్ అధికారులు వివరించారు. అడవులు కాపాడబడితేనే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణం అందుతుందని తెలిపారు. అడవుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ అవగాహన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు నాగేంద్రమ్మ , ఫారెస్ట్ అధికారులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

అగాపే వృద్ధాశ్రమంలో అన్నదానం

యాడికి, ఫిబ్రవరి 3 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో గల అగాపే వృద్ధాశ్రమంలో నంద్యాల జిల్లా అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన వీరాపురం సునీల్, ఆయన భార్య కీర్తన, కూతురు తనూష, కొడుకు చర్విక్ కుటుంబ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. గతంలో తమ కూతురు పుట్టినరోజు సందర్భంగా అన్నదానం నిర్వహించిన ఈ కుటుంబం, ఈసారి ఎలాంటి ప్రత్యేక సందర్భం లేకపోయినా వృద్ధులకు, పెద్దలకు భోజనం పెట్టడం ద్వారా తమ కుటుంబానికి ఆశీర్వాదం కలుగుతుందని, దేవుని దీవెనలు సమృద్ధిగా ఉంటాయని నమ్మకంతో ఆశ్రమంలో భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అగాపే ఆశ్రమ ఫౌండర్ బత్తల ప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొంటూ సునీల్ కుటుంబాన్ని అభినందించి దీవించారు. అలాగే ఆశ్రమంలోని వృద్ధులు, నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేసినందుకు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సునీల్ తల్లి కళావతి, తమ్ముడు సీమోన్ తదితరులు పాల్గొని సహకరించారు

యాడికిలో గ్రామాభివృద్ధిపై గ్రామపంచాయతీ సమావేశం

యాడికి, ఫిబ్రవరి 3 (అనంత ప్రభ)

యాడికి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పండు అనురాధ అధ్యక్షతన గ్రామపంచాయతీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ కాసా చంద్రమోహన్‌తో పాటు వార్డు సభ్యులు పాల్గొని గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. గ్రామంలో నెలకొన్న పారిశుధ్య సమస్యలు, రాబోయే వేసవి కాలంలో తాగునీటి కొరత తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చ జరిగింది. పలువురు వార్డు సభ్యులు తమ వార్డుల్లో ఉన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అలాగే మార్చి నెలలో జరగనున్న శ్రీ శివలక్ష్మి చెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాలకు గ్రామపంచాయతీ తరఫున సహకారం అందించడంపై నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి సాయి అరుణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కారం చేస్తామని తెలిపారు

యాడికిలో మహిళా సంఘం పొదుపు సొమ్ముపై విచారణ

యాడికి, ఫిబ్రవరి 3 (అనంత ప్రభ)

యాడికి గ్రామం ప్రగతి జ్యోతి గ్రామైఖ్య సంఘానికి చెందిన సభ్య సంఘం దీప్తి మహిళా సంఘంలోని పొదుపు సొమ్ముపై వెలుగు కార్యాలయంలో విచారణ చేశారు. సంఘం సభ్యుల డబ్బులను దుర్వినియోగం చేశారంటూ సంఘం మొదటి లీడర్ రాజమ్మ, అనిమేటర్ బాలరాజుపై దీప్తి సంఘం సభ్యులు ఈ నెల 2వ తేదీ సోమవారం యాడికి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం దీప్తి మహిళా సంఘానికి చెందిన 10 మంది సభ్యులు, అనిమేటర్ బాలరాజు మండల సమైఖ్య కార్యాలయంలో లెక్కల పరిశీలన నిర్వహించారు. బ్యాంకు లోన్‌కు సభ్యులు చెల్లించిన కంతులను పూర్తిగా జమ చేయకుండా తక్కువ మొత్తమే బ్యాంకులో జమ చేసి మిగిలిన డబ్బులను మొదటి లీడర్ రాజమ్మ దుర్వినియోగం చేసినట్లు విచారణలో తేల్చారు. సంఘానికి సంబంధించి మొత్తం రూ. 1,98,000 తిరిగి చెల్లించాల్సిందిగా మండల సమైఖ్య నిర్ణయించింది. దీనికి రాజమ్మ కూడా అంగీకరించి సంఘానికి డబ్బులు జమ చేస్తానని హామీ ఇచ్చారు. ఈ విషయమై సంఘ సభ్యులందరూ సంతకాలు చేసి అంగీకారం తెలిపారు

ఆశా డే కార్యక్రమంలో డెంగ్యూ,మలేరియా నివారణపై అవగాహన

యాడికి, ఫిబ్రవరి 3 (అనంత ప్రభ)

జిల్లా మలేరియా అధికారి డి. ఓబులు ఆదేశాల మేరకు మంగళవారం రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ దేవరాజన్, డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు డెంగ్యూ జ్వరాలపై రూపొందించిన మాడ్యూల్స్‌ను ఆశా కార్యకర్తలకు పంపిణీ చేశారు. అలాగే ఏడు సచివాలయాల పరిధిలో మలేరియా జ్వరాల నివారణపై అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. ఆశా కార్యకర్తలు తమ విధులను 100 శాతం సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులు సూచించారు. రానున్న వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఆశా కార్యకర్త తప్పనిసరిగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు తమ వద్ద ఉంచుకోవాలని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా నీటి గుంతల్లో నీరు నిల్వ ఉంటే, వెంటనే ఏఎన్ఎం ద్వారా పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇచ్చి ఆ గుంతలను పూడిపించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఎం.పి.హెచ్.ఈ.ఓ రామచంద్రనాయక్, పీహెచ్ఎన్ గంగాదేవి, ఏఎన్ఎంలు, ఎం.ఎల్.హెచ్.పిలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ భూముల్లో హెచ్చరిక బోర్డు

యాడికి, ఫిబ్రవరి 3 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రంలోని శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయానికి సంబంధించిన భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని దేవస్థానం ఈఓ సుబ్రమణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరి స్వామితో కలిసి యాడికి మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డు సమీపంలో గల ఆలయ భూములకు సంబంధించి సర్వే నెంబర్ 449 లో 7 ఎకరాలు 38 సెంట్లు, అలాగే సర్వే నెంబర్ 448 లో 7 ఎకరాలు 54 సెంట్లు భూములు పూర్తిగా దేవస్థానానికి చెందినవని స్పష్టం చేశారు. ఈ సర్వే నంబర్లకు సంబంధించిన భూములపై ఎవరూ కూడా క్రయవిక్రయాలు జరపరాదని, అలాగే ఆలయానికి చెందిన ఇతర భూములలో కూడా అనధికార లావాదేవీలు చేయకూడదని హెచ్చరించారు. ఈ భూముల్లో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. త్వరలోనే ఆలయానికి సంబంధించిన మిగిలిన ఇనాం భూములకు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తామని ఈవో సుబ్రహ్మణ్యం తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరు గానీ క్రయ విక్రయాలు చేపడితే సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఈఓ సుబ్రమణ్యం స్పష్టం చేశారు

హెల్త్ సూపర్వైజర్ ఏ. రవీంద్ర బదిలి సన్మాన కార్యక్రమం

కూడేరు, ఫిబ్రవరి 3 (అనంత ప్రభ)

కూడేరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు విధులు నిర్వహిస్తున్న హెల్త్ సూపర్వైజర్ ఏ. రవీంద్ర ... పదోన్నతి పై ఆరోగ్య విస్తరణ అధికారిగా కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనపల్లి కి బదిలీ కావడంతో కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఉషారాణి ఆధ్వర్యంలో మంగళవారం రోజున వారి సిబ్బందితో వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి శాలవాలు కప్పి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ కూడేరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు హెల్త్ సూపర్వైజర్ గా ప్రజా ఆరోగ్య సేవలకు కంకితమై నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలను అందించినందుకు డాక్టర్ ఉషారాణి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ బదిలీ అనేది కొంచెం బాధగా అనిపించిన ఉద్యోగరీత్యా బదిలీ అనేది సర్వ సాధారణమై అయినా ప్రతి ఒక్కరూ బదిలీ కావలసిన వారేనన్నారు. బదిలీపై ఎక్కడ ఉన్నా దేవుడు సర్వ ఆరోగ్యాలను ప్రసాదించి నిత్యం ప్రజలకు సేవ అందించి మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యన్ జి ఓ అసోసియేట్ ప్రెసిడెంట్ డి. చంద్రమోహన్, ఏ పి జి ఇ ఏ జిల్లా ఉపాధ్యక్షులు జి, నాగేశ్వరయ్య, వేమారెడ్డి, కే. వెంకటరమణ, సుధాకర్, మరియు మలేరియా ఉపవిభాగం ఆఫీసర్ మద్దయ్య, నూరబాషా, శ్రీధరమూర్తి సూపర్ వైజర్స్ మరియు వైద్య సిబ్బంది అందరూ పాల్గొన్నారు

ఉదిరిపికొండ లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

కూడేరు, ఫిబ్రవరి 3 (అనంత ప్రభ)

ఉదిరిపికొండ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజున "పొలం పిలుస్తుంది" కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పాల్గొని, రబీ పంటల సాగులో తీసుకోవలసిన మెలకువలు గురించి అవగాహన పొందారు. ఈ సందర్భంగా రైతులకు సూక్ష్మ పోషకాలు పంటల ఎదుగుదలలో పోషించే కీలక పాత్రను వివరించారు. ముఖ్యంగా వేరుశనగ పంటలో జిప్సం వినియోగం ఎంత ముఖ్యమో, సరైన మోతాదులో వాడినట్లయితే దిగుబడి మరియు గింజ నాణ్యత మెరుగుపడుతుందని తెలియజేశారు.

అలాగే రైతులు తప్పనిసరిగా (ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రేషన్) చేయించుకోవాలని, తద్వారా ప్రభుత్వ పథకాలు, రాయితీలు సకాలంలో పొందే అవకాశం ఉంటుందని సూచించారు. పీఎం-కిసాన్ పథకం ద్వారా రైతులకు అందుతున్న ఆర్థిక సహాయం, అర్హతలు, నమోదు విధానం గురించి కూడా వివరించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి శ్రీకారం: అదోనిలో ప్రారంభమైన 'ఆరోగ్య జాగృతి యాత్ర'

ఆదోని, ఫిబ్రవరి 3 (అనంత ప్రభ)

ప్రజల్లో ఆరోగ్య అవగాహనను మరింత విస్తృతంగా తీసుకెళ్లాలనే లక్ష్యంతో అదోని పట్టణంలో "ఆరోగ్య జాగృతి యాత్ర" కార్యక్రమానికి ఘనంగా శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు పలు సేవా సంస్థలు ఐక్యంగా ముందుకు వచ్చి ఎంఓయూ) కుదుర్చుకోవడం విశేషం. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ , లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, సివిక్స్ సొసైటీ, ఏపీ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఆర్ఎస్ఎస్, స్వామి వివేకానంద సేవా సంస్థలు సంయుక్తంగా ఈ కార్యక్రమానికి మద్దతు పలికాయి. ఒమెగా హాస్పిటల్ ఈ యాత్రకు పూర్తి స్థాయి సహకారం, ప్రాయోజకత్వం అందిస్తోంది.

సంక్రమణ వ్యాధులు, అసంక్రమణ వ్యాధులు, మహిళా--శిశు ఆరోగ్యం, సామాజిక మరియు మానసిక ఆరోగ్య అంశాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ యాత్ర ప్రధాన ఉద్దేశ్యం. ఈ క్రమంలో

ప్రతి నెల రెండో ఆదివారం గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాలు

త్రైమాసికంగా అదోని పట్టణంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు.

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 4వ తేదీ (బుధవారం) ఉదయం 8:30 గంటలకు

మున్సిపల్ హైస్కూల్ ఆవరణ నుంచి రెడ్డి హాస్టల్ వరకు క్యాన్సర్ అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారు.

ర్యాలీ అనంతరం రెడ్డి హాస్టల్‌లో క్యాన్సర్ నివారణ, ముందస్తు గుర్తింపు, చికిత్సా విధానాలపై అవగాహన సదస్సు జరగనుంది.

ఈ కార్యక్రమానికి ఆదోని ఎమ్మెల్యే గౌరవనీయులు శ్రీ పి.వి. పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

ఈ కార్యక్రమంలో ఐఎంఎ అధ్యక్షుడు డా. వినయ్ కె.ఎస్, ఉపాధ్యక్షుడు డా. సత్పాల్ టి.ఎమ్.డి, కార్యదర్శి ఆదిత్య కుమార్, ట్రెజరర్ డా. సందీప్ కుమార్,

జాయింట్ కార్యదర్శి డా. ఏవీఎస్ కార్తీక్, మహిళా విభాగం ఇంచార్జ్ డా. బి. మనిషా రెడ్డి, లయన్స్ క్లబ్ చైర్మన్ డా. యు. గోపినాథ్, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఉషారాణి, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యదర్శి మంజునాథ్ తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా, సేవా భావంతో ప్రారంభమైన 'ఆరోగ్య జాగృతి యాత్ర' అదోని ప్రాంత ప్రజలకు మేలు చేకూర్చనుంది.

అత్మకూరు తహసిల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్

ఆత్మకూరు, ఫిబ్రవరి 3 (అనంత ప్రభ)

ఆత్మకూరు తహసిల్దారు కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) అర్జీలను ఎలా పరిష్కరిస్తున్నారు, ఇంటిగ్రేటెడ్ క్యాస్ట్ సర్టిఫికెట్ల మంజూరు, రీసర్వే, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ ఏ విధంగా చేపడుతున్నారు, తదితర అంశాలపై తహసీల్దార్, డిటి, తదితరులతో జాయింట్ కలెక్టర్ ఆరా తీశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారాన్ని మరింత మెరుగుపరచాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ క్యాస్ట్ సర్టిఫికెట్ల మంజూరుకు సంబంధించి వీఆర్వో లాగిన్, ఆర్ఐ, తహసిల్దార్ లాగిన్ మంజూరు, రిజెక్టెడ్ పై దృష్టిసారించాలన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ సజావుగా చేపట్టాలని, ఆయా గ్రామాల్లో ప్రభుత్వ నిర్దేశిత గడువులోగా రీసర్వే వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనాయక్, డిప్యూటీ తహసీల్దార్ బాలమ్మ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీహరి, వీఆర్వోలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు

కరుట్లపల్లి ఉన్నత పాఠశాలను సందర్శించిన మండల విద్యాధికారి-2 సాయి కృష్ణ

కూడేరు,ఫిబ్రవరి 3 (అనంత ప్రభ)

కూడేరు మండలంలోని కరుట్లపల్లి ఉన్నత పాఠశాల ను మంగళవారం రోజున మండల విద్యాధికారి-2 సాయి కృష్ణ సందర్శించారు. 10వ తరగతి విద్యార్థులకు తగు సూచనలు చేశారు. కరుట్లపల్లి హెడ్మాస్టర్ మరియు ఉపాధ్యాయుల సహకారంతో వందరోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా ప్రతిరోజు పదవ తరగతి విద్యార్థులకు స్నాక్స్ అల్పాహారం అందిస్తున్నారు. అలాగే పాఠశాలలు పెంచుతున్న కిచెన్ గార్డెన్ లో పండిస్తున్న ఆకుకూరల కిచెన్ గార్డెన్ ను మండల విద్యాధికారి పరిశీలించారు కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆంజనేయులు మరియు ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

సౌత్ జోన్ జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు సెలెక్ట్ అయిన విద్యార్థి విద్యార్థినీలు

అనంత, ఫిబ్రవరి 3 (అనంత ప్రభ)

తిరుపతిలో 7-2-2026 నుంచి జరిగే జూనియర్ అండ్ సీనియర్ షూటింగ్ బాల్ సౌత్ జోన్ నేషనల్ లెవెల్ టోర్నమెంట్ కు సెలెక్ట్ అయిన అనంతపురం క్రీడాకారులు సీనియర్స్ తో అనంతపురం ఎస్ ఎస్ బి ఎన్ కళాశాలకు చెందిన షాలిని, జూనియర్ లో జడ్పీహెచ్ఎస్ స్కూల్ సిద్ధిరాంపురం నకు చెందిన సుస్మిత, అనంతపురం బీటెక్ కాలేజీకి చెందిన పవన్ ప్రణీత్,సాయి సాత్విక్ క్రీడాకారులను అభినందించిన షూటింగ్ బాల్ ప్రెసిడెంట్ గోపాల్, సెక్రెటరీ అమర్ , ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు, జ్యోతి లతా, జానకి ,సునీత, మొ" పీడీలు అభినందించడం జరిగినది

సర్పంచ్ జి బి కరుణాకర్ గౌడ్ గారిని పరామర్శించిన ఈరలక్కప్ప

గుడిబండ, ఫిబ్రవరి 3 (అనంత ప్రభ)

గుడిబండ మండలం మేజర్ పంచాయతీ సర్పంచ్ జి బి కరుణాకర్ గౌడ్ గారు అనారోగ్యం కారణంగా ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మడకశిర నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త యస్ ఎల్ ఈరలక్కప్ప గారు మంగళవారం పార్టీ నాయకులతో కలిసి వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా అనారోగ్యం సంబందించిన వివరాలు మరియు ప్రస్తుతం జి బి కరుణాకర్ గౌడ్ గారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఈరలక్కప్ప గారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, సిద్దేగౌడ, రంగన్న, హనుమంతరాయ తదితరులు పాల్గొన్నారు..

జూదం ఆడుతున్న ఎనిమిది మంది పట్టివేత

యాడికి, ఫిబ్రవరి 3 (అనంత ప్రభ)

యాడికి మండల పరిధిలోని పుప్పాల గ్రామంలో జూదం ఆడుతున్న ఎనిమిది మందిని పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రు 10,250 నగదు, మరియు 8 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు యాడికి సిఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జూదం వంటి అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితులలోను సహించబోమని, జూదంలో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు